# వేదాంతం

"సత్తిరాజు అనే వోవర్సీరు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసు విచారణ జరుగుతోంది"

అని పేపర్లో చదివాను. పదిహేనేళ్ళ కిందట విక్టోరియా హాస్టల్లో నాకు నాలుగుగదు లవతల గదిలోవున్న సత్తిరాజేనేమో! ఆరోజుల్లో ఆ సత్తిరాజుకి నామీదనిష్కారణ గౌరవం. తక్కినవాళ్ళు నన్ను ద్వేషించడానికి అనేక న్యాయమైన కారణాలున్నాయి కాని, యితన్ని గౌరవించడానికి ఒక్కటీ లేదు. నాతో చనువు చేసుకోవాలని చాలా ప్రయత్నించాడు. కాని, నా కతనిమీద ప్రత్యేకమైన ప్రేమ రాలేదు. మొదటినించి నాకు స్నేహితులమీద ప్రేమ వుండేదికాదు. ఇప్పుడూ అంతే. పురుషుడికి నా హృదయంలో చోటులేదనుకుంటాను. కాని, సత్తిరాజు దృష్టి ఎప్పుడూ నన్ను వెంబడిస్తోవుండేది, అతనేనేమో యీ ఆత్మహత్య చేసుకుంది ? ఎందుకో ? నా దుర్భరజీవితాన్ని తలుచుకుని, కొంచెం యీర్ష్యకూడా పొందాను.

గంట కొట్టింది. పత్రికని నక్కలాగు కాచుకుకూచున్న రంగనాథం ముందుపారేసి క్లాసులోకి వెళ్ళాను. కాని, ఆ ఆత్మహత్య నా జీవితాన్నెంత తారుమారు చెయ్యబోతోందో నాకు తెలీదు కదా !

మర్నాడు రాజమండ్రి పోలీసు యిన్స్పెక్టర్ దగ్గిర్నించి వుత్తరం వొచ్చింది.

'ఆత్మహత్య చేసుకున్న సత్తిరాజుగారు, తన కడపటివుత్తరంలో మీవొక్కరి మీదనే తనకు సంపూర్ణమైన విశ్వాస ముందనీ, మీ సహాయమపేక్షించమనీ వ్రాశారు. ఆయన కుటుంబపరిస్థితులు క్లిష్టంగా వున్నాయి ఒకసారి రాగలిగితే సంతోషిస్తాము.'

ఇంకేం అతడే యీ సత్తిరాజు! కాని, పదిహేనేళ్ళలో ఒక్కసారి కలుసుకోకపోయినా నన్ను జ్ఞాపకం వుంచుకోవడమేమిటి ? వున్న గోలలు చాలవూ? ఇదికూడా నానెత్తిన యెందుకు? వెళ్ళకూడదనుకున్నాను. వెళ్ళాను. చచ్చినవాళ్ళదైనా సరే, పరులిచ్చే గౌరవానికి లొంగిపోని వాడెవడు ?

ముందు యిన్స్పెక్టర్ని చూచాను.

'మీరు సత్తిరాజుగార్ని బాగా యెరుగుదురనుకుంటాను. బంధువులా ?'-

-చెప్పాను.

'చిత్రమే ! పదిహేనేళ్ళు కలుసుకోనేలేదా ?'

'తలుచుకోనన్నాలేదు.'

"సత్తిరాజుగారి చావుకి కారణం తెలీదుకదా మీకు ?'

'చచ్చాడనే తెలీదు పత్రికల్లో పడ్డదాకా'

'ఆయన ఒక మలబారు టీచర్ని ప్రేమించాడు, కొంతకాలం తరవాత ఆమె యీయన్ని వొదిలి, ఇంకో గొప్ప వుద్యోగస్తుణ్ణి చనువు చేసుకుంది. ఆయనకోసమే యీన్యూస్, పేపర్లలో సప్రైస్ చేశాము. సత్తిరాజుగారు భరించలేక ప్రాణాలు అర్పించుకున్నారు. ఆయన కడపటి వుత్తరం యిదీ.'

అది చాలా పెద్దవుత్తరం, ఆ వుత్తరంలో అంతా ఆయన భార్య సంగతేగాని, ఆ మలబారు ఆమె సంగతి ఒక్కముక్కలేదు-నాకు సంబంధించిన భాగం-

'నాకు దగ్గిర బంధువులూ, నాకోసం విచారపడేవారూ, శ్రమపడే వారూ ఎవరూలేరు, నా భార్య విచిత్రమైన వ్యక్తి. 'రాక్షసి' అని పూర్తిగా నిశ్చయించలేను. ఆమె హృదయానికి బదులు రాయివుంది. రక్తం బదులు పాదరసం వుంది. ఆమే కనికరిస్తే-నాగతి యిట్లా కాకపోను నాకు పిల్లలులేరు, కాని, దిక్కులేని నా మేనల్లుడు నా పాలపడ్డాడు. వాడిగతి ఏమికానున్నదో అనే నాచింత. వాణ్ణి నాభార్య దాక్షిణ్యంలో వొదలడం నాకు ఇష్టంలేదు. కనక నా స్నేహితులలో గుంటూరులో టీచరుగావున్న -'

అని నన్ను పొగిడి, నామీద భారం పారేసి చక్కా పోయినాడు. నేను గుంటూరులోవున్న సంగతి ఎట్లా తెలుసో! నాకెందుకో ఈగోల ! ఇదంతా నామీద practical joke కాదుకద ! అడగడానికీ వొద్దనడానికీ ఆమనిషి యేడీ! చావుతో యిట్లా బాధ్యతల్ని తప్పించుకుపోవడం చాలా అన్యాయం ఆ లోకంలో ఏదన్నా Supreme Court వుండితీరాలి. ఇట్లాంటి వ్యవహారాలకు.

'నేను చెయ్యవలసింది ఏమీ కనపడదు, నేనేం చెయ్యగలను ?'

'వొచ్చిన చిక్కేమిటంటే, ఆమేనల్లుడిసంగతి'

'నేను పెంచాలా ? ఆమె ఏంచేస్తుంది ?'

"మాట్లాడండి."

'ఆమెతోనా. ఎందుకు ?-'

అన్నాను కాని వెళ్ళాను. ఆమెని సత్తిరాజు అట్లా తిట్టకపోతే, వెళ్ళేవాణ్ణి కాననుకుంటాను.

* * *

ఆ మలబారు స్త్రీ ఎవరో ఏమయిందో తెలీదు. భార్యేమిగిలింది.

ఎండ మీదికి వచ్చినా లేవక, కుక్కలు నిద్రపోతున్నాయి. గోదావరి నీళ్ళలోంచి బడబాగ్నివలె సూర్యకాంతి కళ్ళని కాలుస్తోంది. గాలికికూడా భయంగావుంది కదలడానికి. నది గట్టుకిందవున్న చిన్న మిద్దెమీదికి కాలుతున్న మెట్లెక్కివెళ్ళి తలుపుకొట్టాను. నేనేదో

సత్తిరాజుకి గొప్ప మిత్రుణ్ణి అని యేడిస్తే! నాకు ఆడవాళ్ళని వొదార్చడం కుశలప్రశ్నలూ చాతకావే!

'ఎవరు ?' అంది లోపల్నుంచి విసుకుతో.

'తలుపు తియ్యండి.'

కుర్రాడు ఒకడు తలుపు తీశాడు.

ఆమె మంచంమీద కూచుని వ్రాసుకుంటోంది. తలెత్తి.

'అట్లా కూచోండి' అని మళ్ళీ వ్రాసుకుంటోంది.

'యిదేనా యిల్లు ?'

'ఎవరు ?' అంది తలెత్తకండానే.

'ఇదేనా సత్తిరాజుగారి యిల్లు ?'

'ఊఁ'

'మీరు ?'

'భార్యని. మీరు ?'

తెలియచేశాను, నేనెవరో, ఎందుకు వొచ్చానో.

మాట్లాడుతోనే ఆమెని పరీక్షచేస్తున్నాను. నా అంత పొడుగు వుంటుంది. సన్నని వొళ్లు, ముప్పైఐదేళ్ళకి తక్కువ వుండవు. కొన్ని వెంట్రికలు నెరిశాయి. మూతిదగ్గిర్నించి ముక్కుదగ్గిరికి రెండు ముడతలున్నాయి. ఆమెలో యేమీ రాక్షసత్వం కనపళ్ళేదు. దేవత్వమూ లేదు. నన్ను నిర్లక్ష్యం చెయ్యడమూ, విషాదచిహ్నాలేమీ లేకపోవడమూ- అవే వింతలు. పావుగంట కూచున్నాను. మాటలులేవు. వింతగావుంది. వ్రాయడం అయిపోయి, దారంతీసి చిక్కుతీస్తోంది. ..... నేనే మాటలు ప్రారంభించాలి.

'ఈతనేనా మేనల్లుడు?'

అవును. మీరింత శ్రద్ధతో యింతదూరం వొచ్చారు. ఎంతో దయతో.' అంది ప్రయత్న పూర్వకంగా, అయిష్టమైన డ్యూటీ చేస్తున్నట్టు.

'నేనేం చెయ్యగలను ?'

'ఏమున్నది ? ఏమీలేదు. మళ్ళీ రైలెప్పుడు ?'

'మరి యీఅబ్బాయి సంగతి ?'

'మీరు తీసుకు వెడతారా ?'

'మీ అభ్యంతరం ఏమిటి అతన్ని వుంచుకోడానికి ?'

'ఏమీలేదు. కాని నాకు అవసరమూలేదు. నేనూ ప్రత్యేకం అతనికీ అవసరంలేదు-'

'ఏదో గూఢంగా మాట్లాడుతున్నారు.'

'అనుకున్నాను, స్పష్టంగా, హృదయంలో వున్నదున్నట్టు మాట్లాడితే, ప్రపంచానికి అర్థంకాదు. స్వచ్ఛమైన ఆలోచనకి రంగులు కలిస్తేగాని, చూడగల ప్రజ్ఞపోయింది మనుష్యులకి. నాకూ, అతనికీ ప్రేమబంధం ఏమీలేదు. అందువల్ల పరస్పరంగా భారమైనాము. ఇప్పుడన్నా తెలిసిందా ?'

'బంధువులు లేరా ?'

'పిల్లవాడికి కావలసివాళ్ళులేరు, అసలే పిల్లలు ప్రపంచానికి యెక్కువైనారు, సత్తిరాజుగారు ఇతన్ని చాలా గారాబంగా పెంచారు. దయలేని వాళ్ళకి వప్పచెప్పడం చాలాక్రూరం. ఆయనికి మీమీద గొప్ప విశ్వాసం.'

'ఏమీ కారణం లేదు'

'నాకు అట్లానే తోస్తోంది.'

విచిత్రమైన మాటలు. నా మనసు చివుక్కుమన్నది. నా కోపం గుచ్చుకునేందుకు-

'వుత్తరంలో మిమ్మల్ని దూషించడానికి కూడా కారణం వుందనుకుంటాను.'

'ఉండకేం ?'

ఎట్లా యీమెని నొప్పించడం ?

'మిమ్మల్ని యామన్నాడో చదివారా ?'

"లేదు. కాని వూహించుకోగలను."

'రాక్షసి.....'

నా వంక నిదానంగా కళ్ళెత్తి చూసింది. ఆమెలో ఏమీ అందంలేదు. ఆమె కళ్ళు ఏమీ అసాధారణమైనవి కావు. కాని, ఆ చూపు-ఎన్నడూ నా అనుభవానికందని అవ్యక్తమైన కలవరం కలిగించింది. విస్మయమో, భయమో, గౌరవమో, కోపమో అన్నీనో నా లోపలికి గుచ్చి చూసి, ఏదో తెలుసుకుని సంతుష్టి చెందినట్టు. కళ్ళు చేతిలోని దారంమీదికి ప్రయత్న పూర్వకంగా వాల్చింది. నా కోపం పోలేదు ఇంకా. అనాథైన అవినీతురాలైన స్త్రీ చేతిలో-మొగవాడు అపజయాన్ని అంగీకరించడం ఎంత కష్టం?

'అతని చావుకి మీరు కారణమన్నాడు' అని ఇంకా గుచ్చాను.

ఏ మాత్రమూ చలించలేదు.

'రక్షించకలిగి వుందునని ఆయన అభిప్రాయం.'

'శక్తి వుండి కూడా వుపేక్షించారా ? నేను నమ్మను!'

'పోతలిచిన వారిని అడ్డు పెట్టడం ఏం మర్యాద !'

-హడిలిపోయినాను.

'అంత కోపమా ?'

'లేదు'

'మరి-'

ఆలోచించింది.

'ఏం లేదు. పోనీండి.'

'మీకు అర్థంకాదు' అన్నట్టు వినబడ్డాయి ఆ మాటలు నాకు - కంఠంలో, అప్రయత్నంగా కళ్ళలో ఇందాక కనబడ్డ అద్భుత ప్రపంచాలే వినపడ్డాయి ఒక్కొక్క మాటలో.

విచిత్ర వ్యక్తి !

నేను వొంటరిని. రోగిని. ఆ సంగతి సత్తిరాజుగారికి తెలీదనుకుంటాను అన్నాను.

'పోనీండి. యిబ్బందిలేదు.'

'ఇంకే విధంగానన్నా నేను.....'

'ఏముంది ? ఏమీలేదు.'

'నేను వెళ్ళేముందు మళ్ళీ వొచ్చి చూస్తాను.'

తల వూగించింది. కాని అవసరం లేదు అన్న మాట తెలుస్తోనే వుంది.

* * *

రాత్రి పదకొండింటికి రైలెక్కాలని నిశ్చయం చేసుకుని నలుగురైదుగురు స్నేహితుల్ని చూశాను. ప్రతివారూ ఆమె సంగతి విన్నవారే గాని, స్వయంగా తెలిసినవారెవరూ లేరు.

"విచిత్రమైన మనిషిరా ! ఒకామె పిల్లపోయి యేడుస్తోవుంటే-

'కొట్టేందుకు ఇంక యెవరూ లేరనా యేడుస్తున్నావు' ? అందిట" అని చెప్పారు ఒకరు.

ఇంకోరు-' 'అది ఆడదిరా ! రాక్షసి !!-'

"బాపినీడు భార్య వోదార్చడానికిపోతే 'నీ పెనిమిటి పోయినప్పుడు వొస్తానని ఆశా!' అని యింకోడు.

'దీంతో పడలేకే ఆ మలబారు దాంతో తంటాలు పడ్డాడు సత్తిరాజు. ఇదే చంపింది వాణ్ణి. తెలుసునా ? సత్తిరాజు శవాన్ని పోలీసువాళ్లు దహనం చేశారు. తనకేమీ సంబంధం లేదు పొమ్మందిట' అని మరివొకడూ.

సత్తిరాజుని చూస్తే అందరికీ గౌరవమూ, ప్రేమా, అతని విపరీత మోహానికిగాని, యీర్ష్యకిగాని ఒక్కరూ నిందించలేదు అతన్ని.

రాత్రి వెళ్ళి మెట్ల దగ్గిర తలుపుమీద చెయ్యి వెయ్యగానే, తెరుచుకుంది. కుర్రాడు నిద్రపోతున్నాడు. హాలులో ఎవరూలేరు. పక్కగదిలో దీపముంది. పిలవబోతోవుండగా మాటలు వినపడ్డాయి. ఒకటి మొగకంఠం. ఇదా యీమెకి విచారం లేకపోవడానికి కారణం? అతని మృత్యువు వాస్తవరూపం యిదీ ! ఇందుకా యీ కుర్రవాణ్ణి వొదుల్చుకోడం ! స్పష్టమయింది.

'ఐదువందలా ? ఇయ్యను ?' అంది ఆమె.

'సరే. ఆలోచించుకో, రేపు సాయింత్రం దాకా' అన్నాడు మొగవాడు.

'జైలంటే భయం లేదు నాకు. ఈ జీవితమే ఖైదు.'

'అంతలో ఆగదు.'

'మరీ మంచిది'

'అది కూడా కాదు. ఆడదానివి.'

'అంతే కద !'

చప్పున యిద్దరూ బైటికి వొచ్చి, నన్ను చూశారు. ఆమె యెప్పటివలెనే, నానించి కళ్ళు కిందికి వాల్చి, ఆలోచనలో పడ్డది. ఆయన నన్ను చూసి భయపడ్డాడు.

'ఎవరు ?'

-చెప్పాను. వెళ్ళిపోయినాడు.

'కూచోండి.'

'ఈ రాత్రే ప్రయాణం.'

'విన్నారు. అవునా ?'

'చివరి భాగం'

దుప్పటిమీది గీతల వెంబడి వేళ్ళు పోనిస్తో కూచుంది. ముఖంలో కొంచెం బాధా. కోపమూ కనపడుతున్నాయి.

'నాకా విషయం తెలీదుగాని, నా సహాయంవల్ల లాభం వుంటే-' ప్రయాణం తొందరలేదు.

'మొగ సహాయంలేని ఆడది ప్రపంచానికి ఎంత చులకన ! అల్లుకోని తీగెవలె కాళ్ళ కింద తొక్కుతారు.'

'కొన్ని తీగెలకి ముళ్ళుంటాయని తెలీదు వాళ్ళకి'

కొంచెంగా నవ్వింది. నా insultని లెఖ్క చెయ్యక.

'మొగవాళ్ళు బూడ్సులు వేసుకుంటాను ! చేతులో కర్రలుంటాయి.'

'నేను బూడ్సూలూ, కర్రలూ గోదావరిలో పారేసి వచ్చాను.'

'సత్తిరాజుగారిమీది గౌరవం వల్ల.'

'కాదు, మిమ్మల్ని చూశాక.'

'నాకు అందం లేదు.'

'అవును మీ శరీరానికి'

'అంతే ప్రపంచం చూడగలిగింది.'

'ప్రపంచంలో అందరూ వొకటి కాదు.'

'మిమ్మల్ని తప్పు అభిప్రాయం పడ్డాను, మొదట్లో'

'ఏమో చెప్పలేము.'

'ఆయన పోలీసు సబిన్స్పెక్టర్. ఐదువందలు లంచమివ్వకపోతే-సత్తిరాజుగారి వ్యవహారంలో నన్ను అరెస్టు చేయిస్తాట్ట.'

'వాడి మొహం. ఇన్స్పెక్టర్‌తో మాట్లాడతాను. సూపరెంటునే చూస్తాను.'

-వూరుకుంది.

'భయపడదేం ?

'నిజంగా అరెస్టుచేస్తే. ఎట్లా అనదేం?' అని గోలపెట్టింది నా పురుషహృదయం.

వొప్పుకుంది గావును. నేను వుండిపోవాలని ఆవుళ్ళో; వీళ్ళందర్ని చూడాలి. ఇంకా యేం చిక్కులు వున్నాయో; ఈమెమీద యేం అనుమానాలు వున్నాయో! నాకెందుకుకీ గోల? నా ఆలోచనల్ని గ్రహించిందేమో!

'మీరు వెళ్ళండి భయంలేదు.'

'మరి మీరు?....... .....ఎవరూ స్నేహితులు లేరా?'

'లేరు'

'ఎందుకు? మీకేం తోస్తోంది? ఏం చేస్తారు పొద్దస్తమానం?'

'ఏమీ చెయ్యను. అట్లా చూస్తో కూచుంటాను.'

'వంట?'

'హొటలు.'

'ఎందుకు ఏమీ చెయ్యరు?'

'తిండికి లేకపోతే పని చెయ్యవలసి వొచ్చేది. ఆ బాధ లేదు. ఇంకేం పనివుంది?'

'స్నేహితులు'

'ఎవరూ స్నేహం చెయ్యరు నాతో.'

'చదువుకోడం'

'కొంచెం చదువుతాను. కాని, కొత్త సంగతులు వుండవు. పుస్తకాల్లో!-'

'కథలు, చరిత్ర, వ్యాసాలు, పురాణాలు, అన్నీ తగులూ, పిల్లల్ని కనపడమూ, చావడమూ, ఏదీ చూసినా అంతే-ఎందుకు చదవడమూ-అర్థంలేని నీతులూ, వేదాంతం?'

'మరి అందరూ పనులు చెయ్యటం లేదా?'

'అదే నా ఆశ్చర్యం'

'పని చెయ్యక వూరికే తిని కూచోవడం స్వార్థం, సోమరితనం.'

'అంతకన్న యేం చెయ్యాలి? వీళ్ళేం చేస్తున్నారు? క్లబ్బు, టెన్నిస్, పేకాటా, కబుర్లూ ఇవన్నీ ......'

'మరి వుద్యోగాలూ.'

'పోలీసులూ, టీచర్లూ, లాయర్లూ, వీళ్ళందరూ, ఏం వుపయోగం-తిండిలేక చేస్తారు. పరోపకారమా?'

'తిండికై చేసినా, వుపకారమేగా!'

'కాదు. ఈ వుద్యోగస్తులు చేసే అపకారం ఎవరూ చెయ్యరు.'

'టీచర్లూ, డాక్టర్లూ-'

'వాళ్లూ అంతే'

'పోనీ, మీరేదన్నా కుట్టూ అవీ చేసి, సంపాయించరాదా?'

'ఎందుకు సంపాయించడం?'

'ఇతరులకి యియ్యడానికి'

'ఎందుకు యివ్వడం?'

'వాళ్ళ సహాయానికి'

'ఎందుకు సహాయం చెయ్యడం?'

'మీరు ఆపదలో వుంటే ఎవరన్నా సహాయం చెయ్యావొద్దా!'

'నాకు అపాయమా? ఏమి అపాయం? తిండే లేకపోతే, జబ్బు చేస్తే; మనుషులు, కుక్కలు, ఒక్కసారి సహాయం చేశామా యింక వొదలరు. కొంచెమిచ్చామా, యింక యీ కాముకులు మోస్తరే! నాకు సహాయమా? అక్కర్లేదు. భరించలేకపోతే, ద్వారం తెరిచే వుంది

కాని, నిజంగా సహాయం-యీ వొంటరితనానికి స్నేహం, మృత్యుబాధకి పునర్జీవితం యిస్తే-సహాయం. నేను ప్రేమించుకునేందుకు బిడ్డ నివ్వగలరా, ఆబిడ్డ చస్తే ప్రాణమివ్వగలరా? ఇంక సహాయమేమిటి? ఏ సహాయమూ అక్కర్లేదు.

'మీకెందుకు స్నేహితులు వుండకూడదూ? ఒకరూ రారే!'

ఆమె కళ్ళలో నీళ్ళు మెరిశాయి.

'పాట, చిత్రలేఖనం'

'ఎందుకవన్నీ, ! పిల్లలు ఆటలు. ఇట్లా బాగా వుంది.'

'మరి యీ వంటరితనంవల్ల బాధ ధ్వనిస్తోంది మీ కంఠంలో.'

లేచి నా ప్రక్కన వొచ్చి కూచుంది అంత రాత్రి వొంటరిగా మొగాడితో మాట్లాడుతున్నాననే సంకోచమే లేదు. తలుపు అట్లా వోరగా తీసే వుంది.

'స్త్రీలైనా రారే!'

మాట్లాడదామా అన్నట్టు యోచించింది.

'కూరలూ, చీరెలూ మాట్లాడితే. దొంగవిచారాలన్నింటికీ క్షుద్ర యీర్ష్యలకూ సానుభూతి చూపితే, యితరుల్ని నిందిస్తే, ప్రపంచాన్నీ దేవుణ్ణీ తిడితే, వూరికే విచారాల సొద వెళ్ళబుచ్చుకుని వారి ఆధిక్యాన్ని నిలవ పెడితే ప్రజలు చేరతారు.'

'పోనీ యీ ఆపదలోనైనా-'

'ఆపదవొస్తే చాలదు. ఆపద ముందు కుంగిపోవాలి. సహాయానికై అరవాలి. ఏసహాయమూ ఇవ్వక పోయినా, కృతజ్ఞత చూపాలి. సహాయం అక్కర్లేదంటే ప్రపంచానికి ఎంతో కోపం వొస్తుంది! ముఖ్యం ఆడదాని మీద. అందువల్లనే అణకువనీ, దీనత్వాన్నీ స్తుతించారు శాస్త్రకారులు! అవి సుగుణాలేకావు జీవనోపాధులు.

ఇంకా అంది.

'మీ సహాయం కృతజ్ఞతతో నేను స్వీకరించక పోవడం మీ కెంత బాధకరంగా వుందో నేను గమనిస్తోనే వున్నాను. కాని, మీరు కొంత ఉన్నతంగా వున్నారు.'

నివ్వెరబోయి చూశాను. ఏమి మనిషి! నానోట మాటరాలేదు కొంతసేపు. సమర్థించుకుని

'ఏమైతేనేం? నేను మీకోసం కొంతకాలం వినియోగించ తలుచుకున్నాను.'

'సరే'

'కాని నామీద నమ్మకం పెట్టుకోవొద్దు.'

అన్నాను దడిపిస్తో.

'సరే.'

అరే !

'ఒకవేళ నేను అపజయం పొందితే !'

'పోనీండి.'

'ఐదువందలు ఇయ్యనా ?'

'నా దగ్గిరే వున్నాయి. కాని, ఇయ్యను.'

'మరి !'

'జైలుభయం లేదు'

'కాని ఆపవాదు-కోర్టు ప్రశ్నలు.'

చిరు నవ్వుతో వూరుకుంది

'చెప్పండి'

'నేను రాక్షసిని,' అంది నెమ్మదిగా !

అని పరధ్యానంలో పడ్డది. లేచి వెడుతున్నాను అన్నానుగాని. ఆమె పలకలేదు. మెల్లిగాతలుపు మూసి వెళ్ళాను. సందుచివర అదే ఆలోచిస్తున్నాను. తలుపు గడియ వేసుకోలేదే, పన్నెండయింది.

క్షేమమా? మళ్ళీ వెళ్ళాను, అట్లానే కూచునివుంది. మూల దీపం వెలుగుతోంది. మంచంకింద చీకట్లు కూచున్నాయి.

'నేను వెడుతున్నాను తలుపు వేసుకోండి.' కొంచెంసేపటికి తలెత్తింది. గడియారం వంక చూసింది.

'క్షమించాలా. ఏదో ఆలోచనలో పడ్డాను.'

'నేను వెడుతున్నాను, తలుపు వేసుకోండి.'

నా వెంటనే తలుపు దగ్గరికి వొచ్చింది. తలుపు దగ్గిర వెడుతున్న నా బుజంమీద చెయ్యేసింది. తిరిగాను. నా చెయ్యి గట్టిగా పట్టుకుంది.

"మీకెందుకు భయంలేదు?" అని అడిగాను.

"ఆశలేదు గనక." అంది- అని ఆగి మళ్ళీ-

'మీరు మంచివారు లాగున్నారు. ఈ లోకానికి పనికిరారు.'

అని చిరునవ్వు నవ్వింది. పెదవులేకాదు, కళ్ళేకాదు, ముఖమంతా, ఆమె శరీరమంతా పెద్ద చిరునవ్వువలె తోచింది. ఆరాత్రంతా ఆమే నా కలలలో.

మర్నాడు పోలీసు ఇన్స్పెక్టర్ని చూడడమూ, సబిన్స్పెక్టర్ని చివాట్లు పెట్టించడమూ, అయ్యేప్పటికే మధ్యాన్నమయింది. ఇన్స్పెక్టర్ నాలుగు అర్జీలు నాముందు పెట్టాడు. నన్ను చదవనీలేదుగానీ, అవన్నీ వూళ్లో పెద్దమనుషుల దగ్గర్నించి అనీ, ఆమె సత్తిరాజు చావుకి కారణమనిన్నీ. ఆమెని ఎరెస్టు చేయమని ప్రార్థనలూ బెదిరింపులూ అనీ చెప్పాడు.

'ఏమో సాక్ష్యం ఎట్లా తిరుగుతుందో అని భయంగా వుంది. ఆమె పక్కలో చచ్చిపోయినాడు. ఆ వుత్తరమే లేకపోతే, ఆమెపని అపాయమయ్యేదే! వూరందరికీ ఆమెమీద చాలాకోపంలాగుంది. కొద్ది రోజుల్లో ఆమెని ముంచడానికి ఏదో అల్లేట్టున్నారు. ఆమె వెంటనే యీవూరు వొదిలితే బావుండును.'

సాయంత్రం నేను వెళ్ళేప్పటికి ఆమె వరండాలో గట్టుమీదికి కనపడకుండా వెనకాలగా మంచం వేసుకుని గోదావరివంక చూస్తోకూచుంది. నావంక చూడలేదు. నేను ఎదురుగా కుర్చీలో కూచున్నాను. ఆమె యింట్లో, గట్టుమీది ప్రజలకు నేను కనపడుతూ కూచోడం నాకు బాధగానే వుంది. గాలికి యిసికరేగి నీళ్ళమీద పడుతోంది. నీళ్ళుచింది యిసికమీద పడుతోన్నాయి. కొవ్వూరు పడవ పూర్తిబరువుతో మూలుగుతూ పోతోంది రెండోవేపు.

మెల్లిగా నావంక చూసింది. అపాయం తప్పిందని చెపితే తల వూయించింది.

'కాని మీరీ వూరు వొదిలితే మంచి'దన్నాడు.

'మంచిది కాకపోతే నేం ?'

'అంత మొండితనమెందుకు? వొదిలితేనేం? నష్టమేముంది?'

'ఎందుకు భయపడాలి?'

'భయమేముంది! ఇట్లాంటి అనవసరమైన పంతంతోనే మీరు వొంటరై పోయినారు. లోకమేమీ అంత చెడ్డదికాదు. కాని దగ్గిరికి వొచ్చిన వాళ్ళనల్లా రక్కితే వూరుకుంటారా?'

'కొంత చిదుం వొదులుతుంది.'

'మీకేం సంతోషం?'

'బరక్కపోతే నెత్తినెక్కుతారు.'

'మధ్యమార్గం లేకపోలేదు, మరి మీరు ప్రయాణం కావాలి. వినరూ? పోనీ, మీకోసం కాదు, నాకోసం'

'సత్తిరాజుగారి కోసం అవునా?'

'అదేవద్దంటున్నాను. ఎందుకు? ముందే అనుమాన పడతారు? అందుకే ప్రజలు కోపగించుకుంటారు. నేను నా కోసమే అడుగుతున్నాను.'

'నాకూ మీకూ ఏమి సంబంధం? మీరెవరు, నేనెవరు ?'

'సంబంధం వున్నవాళ్ళని దగ్గిరికి రానిచ్చారా, మాట్లాడ నిచ్చారా?'

'అవును. మీకెందుకు ?'

'అవును ! నాకెందుకని లోకాన్ని మీరు వొదిలినా, లోకం మిమ్మల్ని వొదలలేదు. శత్రువులూ, మిత్రులూ వుండనే వుంటారు.'

'నన్నెవరూ ఏమీ చెయ్యలేరు.'

'అహంభావపడకండి. ఎంతవారైనా మనుష్యమాత్రులే.'

'పోనీలెండి, ఎందుకదంతా ? ఎక్కడికి వెళ్ళాలినేను......ఎందుకు వెళ్ళాలి ? నేను వెళ్ళను.'

ఆమె చెయ్యి పట్టుకున్నాను.

'మీకు బాధకలిగితే నేను భరించలేను, నాకోసం.'

నవ్వింది.

'-నటన'

'పోనీ అట్లానే.'

'ఎక్కడికి వెళ్ళను. నాకెవరూ తెలీదు.'

'మావూరు రండి.'

'మీవూరా ? నిజంగానే !'

కొంచెం వుత్సాహం వొచ్చింది.

నేను చేసిన తప్పు గ్రహిస్తున్నాను. కాని కాలు వెనక్కి యెట్లా తియ్యను ?

'నిజమే.'

'వొస్తే......అంత భారమూ మీదే.'

చచ్చాను. ఈమెని యేం చెయ్యను ? ఎట్లా పోషిం-

'నాకు డబ్బు వుందిలెండి. భారమంటే సామాన్లూ, యిల్లూ, హొటలూ-అన్నీ

అమ్మా ! నాయింటోనే దిగుతుంది గావునని ఎంతో భయపడ్డాను. ఈమె దిగితేనా ! నా వుద్యోగం సున్న ! ఆ రంగాచార్లు వూరుకుంటాడా? వూరంతా మోయించడా ?

'సరే.'

"మీవూళ్ళో నేనున్నయింటికి మీరు రానక్కర్లేదు లెండి" అంది.

"ఎందుకు రానూ?"

చిరునవ్వు నవ్వింది.

"సరేలెండి. మీకే తెలుస్తుంది."

"మీరు చెప్పాలి."

"ఏం లేదు. నేను రాక్షసిని."

"అట్లా అని ప్రపంచాన్ని బెదరకొట్టి విరోధం చేసుకున్నారు. అంతే."

అంధకారంలోకి కొట్టుకుపొయ్యే తెరచాపల్నీ, నీటి మీదనించి రోడ్డువేపు చీకట్లో కలిసిపొయ్యే గబ్బిలాల్ని చూస్తో కూచున్నాము.

మీకు వెంటనే బైలుదేరడానికి వీల్లేదా ?"

"మీదే ఆలస్యం."

"మరి కర్మ....మీ భర్తకి....అపరకర్మ...."

"ఏంలేదు."

నిజంగా రాక్షసే !

"చెయ్యకపోవడమేమిటి ?"

"ఎందుకు?"

"ఎట్లా?"

ఈ రాక్షసి నా వెంట పెట్టుకుపోతున్నాను ? తప్పించుకోడానికి వీలులేదా ?

'వూరికే ముసిలమ్మమల్లే ప్రశ్నలు వెయ్యకండి. చదువుకున్నవారు కూడాను! చెయ్యక పోతేనేం ?'

నిజమే. చెయ్యకపోతేనేం ? జవాబు ఏముంది ? ఇదివరకు ఆ ప్రశ్నవేసుకోలేదే నేను. ఎందుకు చెయ్యాలనే సంశయమేరాలేదే ! జీవితమంతా యింతే గావును ! 'అందరూ చెయ్యటం లేదా .' వూరుకుంటారా? 'వెలి' ఇట్లాంటి ప్రశ్నలువొచ్చి నోరు నొక్కుకుని వూరుకున్నాను. కాని గౌరవం నిలుపుకోడానికి వేదాంతంలోకిపోయి 'మరి అతని ఆత్మ-అన్నాను.

చచ్చాను!

'ఆత్మ ఏమవుతుంది ?'

'నాకేం తెలుసు ?'

'పోనీండి ఏదో తెలిసినట్లు ఆయన ఆత్మకోసం ఆదుర్దాపడితే మీకేమన్నా ఆత్మల సంగతి తెలుసునేమొ ననుకున్నాను.

ఆలోచిస్తున్నాను. ఇట్లా తిరగబడితే - ఎవరూ లేరా యీమెకి సలహా యిచ్చేందుకు?

'మీ అక్కగారు.....'

'మీ కెట్లా తెలుసు ?'

'చెప్పారు. ఆమె రాలేదా?'

"వొచ్చింది. వీధులోంచే యేడ్చుకుంటో- "ఏమే ! యేం కష్టమొచ్చిందే ? అట్లా యేడుస్తున్నావు ?'' అన్నాను, 'అయ్యో నీ కోసమేనే ఎంత కష్టం వొచ్చిందే నీకు' అంది. నా కష్టం అట్లావుణ్ణీ. వొచ్చిన కష్టమంతా నీకు లాగుందేమే? అదెట్లా జరిగిందే! నాకు తెలీనే తెలీదు'' అన్నాను. తిట్టుకుంటో పోయింది'

'అట్లానే అనవసరంగా పోట్లాడతా' రన్నాను.

'అనవసరంగానా?' అని కోపంతో అని నెమ్మదిగా.

'అవును. మరిచిపోయినాను' అంది.

'ఏమిటి?'

'ఏమీలేదు.'

'చెప్పాలి. తప్పదు.'

'మీరూ వాళ్ళలో ఒకరని మరిచిపోయినారు.'

'ఒకణ్ణే. కాని మీతో సంపూర్ణమైన సానుభూతిని కలవాణ్ణి. మిమ్మల్ని అర్థం చేసుకోవాలని ప్రయత్నిస్తున్నారు. మీకు మాత్రం నా అనుభవం నించి నేర్చుకోగల విషయాలు వుండకూడదా?'

'ఒకణ్ణే. కాని మీతో సంపూర్ణమైన సానుభూతిని కలవాణ్ణి. మిమ్మల్ని అర్థం చేసుకోవాలని ప్రయత్నిస్తున్నాను. మీకు మాత్రం నా అనుభవం నించి నేర్చుకోగల విషయాలు వుండకూడదా?'

'నిజమే లెండి.'

'అవును, మీరు వృథాగా యితరుల్ని బెదరకొడుతున్నారు. మీలో వున్న హృదయ విశాలత్వాన్ని వాళ్ళు చూడడానికి అవకాశాన్ని యియ్యరు. ఇస్తే తక్కిన సంగతులు వాళు ళ్ళ క్షమిస్తారు.'

'నేనేం చెయ్యను. నాకీ చావువల్ల విచారం రాలేదు, నటించవా?'

'ఎందుకు విచారం లేదూ ? నేను నమ్మను.'

'లేదు, అంతే.'

'ఐతే, అసాధారణ స్వభావమైనప్పుడు, కొంత నటన అవసరమేమో !'

'చాత కాదు'

'ఇకనన్నా మార్చుకోవాలి.'

"మీ సౌఖ్యం కోసమా ? మీ వూరు వొస్తున్నాననా !

నావంటి దానితో మాట్లాడడం మీకు నామర్దా. వెళ్ళండి ఎవరు పిలిచారు మిమ్మల్ని ! నా తోవన నన్ను బతకనీక, నన్ను యీ ప్రపంచంతో కలిపెయ్యాలని మిత్రులవలె. శత్రువులవలె, నన్నెందుకిట్లా బాధపెడతారు?"

"చూశారా మీ "యిగోయిజమ్!' నేను నా సంగతే తలచుకోలేదు, మీ క్షేమం విచారించే మాట్లాడాను. ఇదివరకు సత్తిరాజుగారున్నారు. ఆయన రక్షణ కూడా వుండదు. లోకమెంత క్రూరమో మీకే తెలుస్తుంది అందులో స్త్రీలు."

'స్త్రీ ఐతే నేం ?'

'ఐతే నేనూ ? రౌడీలు, పోలీసులు, విటులు'

'నాలో యితరులాసించగల ఆకర్షణలేదు.'

'పురుషుల పశుత్వపు బలం మీకు తెలీదన్నమాట.'

'పోనీండి. అంత నామీదే కాంక్ష గలిగితే, అంత అపాయం తటస్థిస్తే, కానీండి, పోయిందేవుంది?'

ఇంకేమనను ?

'నా క్షేమం విచారించే చాలామంది చాలా చేశారు. ఇతరుల క్షేమం కోసం సలహా లిచ్చేవాళ్ళంత దొంగలు ఎవరూలేదు." అంది-

మెల్లిగా ఆ యింటి వెనక చంద్రుడుదయించాడు. గోదావరి అవతలిగట్టు ముసుకు తొలగించి, మమ్మల్ని చూసి నవ్వింది.

ఆమె నా వంక చూడక ఏదో ఆలోచనలో పడ్డది. నా మనసంతా ఆమెతో నిండిపోయింది. వెన్నెలా, గోదావరిజలం. ఆమె రూపమూ అన్ని ఐక్యమైనాయి. ఆమె ఆత్మ శరీరంలోంచి క్రమంగా నా చుట్టూ అలుముకుంది. నా కళ్ళముందు మధ్యాన్నం చూచిన ఆమె చూపులవెలుగే కనబడుతోంది. ఆమె కంఠంలో గంభీరత్వం వినబడుతోంది యింకా. గొప్ప పాటలో, కవిత్వంలో, సముద్రపు లోతులో వుండే గాఢత్వం గుర్తించాను ఆమెలో. గొప్పతనం అనుభవంలో ఆత్మలో వుంటేనే కాని కళ్ళల్లో కనబడడం అసంభవం. ఎంతో సాధనచేసి సంగీతంలో నేర్పు సంపాయించవొచ్చు, స్వభావసిద్ధంగా కంఠమాధుర్యం వుండవొచ్చు. కాని ఆత్మల నాకర్షించి, లోకరహస్యాలను విప్పి చెప్పగల పాఠకుడిలో ఆత్మ ఔన్నత్యం వుండాలి. జన్మవల్లనో, ఆత్మసాధనవల్లనో గొప్ప చిత్త సంస్కారం సంపాయించింది. ఆ గంభీరత్వమే పలికింది నా ఆత్మలో ఆమె చూపులోంచి, కంఠంలోంచి,

సత్తిరాజుగారిని రక్షించగలిగి కూడా, తప్పుకోడం న్యాయమేనా మీకు ?

ఆమెని చూచినకొద్దీ సందేహాలే నాకు. ఆమెలోని ఉదారత్వానికీ ఆమె చేసిన పనులకీ సామరస్యం కుదరక వూరికే ప్రశ్నలు వేస్తున్నాను.

ఆలోచించింది చెప్పనా, వొద్దా అని.

'మా యిద్దరికి గొప్ప ప్రేమా లేదు, విరోధమూ లేదు. సాధారణ కుటుంబాల వంటిదే. కాని ఆయన స్వభావం మోహపూరితం, నాది సత్యపూరితం. అందుచేత సామరస్యం కుదరలేదు. పుస్తకాల్లో చదువుతాను. కాని దారుణమైన పురుషవాంఛ నేనెరగను. పాపం ! తృప్తికాని ఆ మోహోద్రేమంతా ఆ మళయాళ స్త్రీ మీద వర్షించారు. విఫలమయింది. నిరాశా. ఈర్ష్యా యిన్నీ ఆయనకి జీవితంమీద ద్వేషాన్ని పుట్టించాయి. గోదావరిలో పడాలని ప్రయత్నించారు, నేను తప్పించాను. నేనే పట్టుబడితే ఆయన్ని యింకా బతికేట్టు చెయ్యగలిగి వుందును. కాని అవసరం కనిపించలేదు."

'అవసరం కనిపించలేదేమిటి ?'

"అవును. ఎవరి కవసరము ? నాకు కాదు, పిల్లలువుంటే ఆలోచించి వుందును. ఓవర్సీర్లు కావలసినంతమంది. ఆయనవల్ల ఎవరికేమీ అవసరం ?"

'పోనీ బతికితే నేం ?'

'ఆయన బాధ ?'

'స్థిరంగా బాధ ?'

'వుండేదేమో ! కాని చస్తేనేమి ? ఎన్ని జీవకోట్లు చావడం లేదు?

'బావుంది.'

'కనక, నాకు బాధలేకండా చంపే మందు తెలుసు-అది యిస్తానన్నాను. ఇచ్చాను.'

నాకు ప్రపంచమే అంధకారమయింది.

* * *

నేను బడికి నెలరోజులు శెలవుపెట్టాను. ఆమెని గుంటూరు తీసుకువెళ్ళడానికి గుండెల్లేవు. ఆవూరూ యీవూరూ, మేమిద్దరము ఎవరికీ తెలీని స్థలాల్లో తిరుగుతున్నాము. ఆసాయంత్రము ముక్తూరు బంగాళా వరండాలో కూచున్నాము. సముద్రవంక చూస్తో.

నిజంగా ఆమె విచిత్రమైన వ్యక్తి, నా పక్కనే మంచం వుంటే అక్కడే పడుకుంటుంది. ఒక బంగాళలో మంచమే లేదు. నాపక్క తడిసిపోయింది. ఇద్దరం ఒకటే పక్కమీద పడుకున్నాము. చెయ్యి దగిలినా, నిద్దట్లో మీద చెయ్యివేసినా ఏమీ మాట్లాడదు. ఆమెని చూస్తే నాకూ మోహమా? లేదు. అమితమైన భయం, వొంటరిగా ఆడదానితో

తిరుగుతూవుంటే, కుమ్మరి పోలిని చూసినా అసహ్యం మరిచిపోతాం ఏదో నిమిషాన. లక్ష్మీదేవి మీద భక్తి మరిచిపోతాం ఏదో ఒక సమయాన. కాని నేను అడిగితే, ప్రేమచూపిస్తే, వెక్కిరించి యేడిపిస్తుందని భయం. సెంటిమెంటు, భయం. అబద్ధం యివేమీలేవు. అంతా సైన్టిస్టుమల్లే విడతీసి ఆలోచించి సరిహద్దులేర్పరుస్తుంది. స్నానం చేస్తోకూడా తలుపు గడియవేసుకోదు. చీరె కట్టుకోడానికివొచ్చి నన్ను అవతలికి పొమ్మనదు. రైలు అందనీ, తప్పనీ, భోజనం దొరకనీ, మాడనీ, ఒకటే ఆమెకి. ఎక్కడికి, వెడుతున్నాము ముందేమిటి యీ ప్రశ్నలేలేవు. ఆ కుర్రాణ్ణి రుషివాలీ హాస్టలుకి పంపించాము. యిద్దరమూ ఆలోచించి. చదవదు. పాడదు, మాట్లాడదు. నేనెందుకు తిరుగుతున్నాను ? ఆమె మరి నా మీద ఏ ఆకర్షణ ప్రయోగం చేసిందో. ఆమె వుంటేగాని నాకు శాంతిలేదు.

ఎనిమిదయింది. సముద్రం చీకటికి తిరగబడి అరుస్తోంది బోనులో కొత్త సింహంలాగు. గంట సేపణ్ణించి ఆమె మాట్లాడలేదు. నాకు 'పైప్' అన్నా స్నేహముంది. ఆమెకీ ! ఏమి ఆలోచిస్తుందో ! వొంటరితనం భరించలేక ఏదో ప్రశ్నవేస్తాను. మాట చెపుతాను. ఊఁ అని వూరుకుంటుంది.

ఇక భరించలేక కుర్చీమీదవున్న ఆమె చేతిమీద చెయ్యివేశాను. కొంచెం అట్లానేవుంచి చెయ్యి మెల్లిగా తీసేసుకుంది. ఆరాత్రి నామనసు మొగతనంతో మారాము పట్టింది, నాచేతిని ఆ రాతిప్రతిమ బుజంమీద వేసి, వేళ్ళు బిగించాను. వూరుకుంది. కొంత సేపటితరువాత తన చేత్తో నావేళ్ళని పట్టుకొని చాలా స్నేహంగా, జాగ్రత్తగా నా కుర్చీమీదికి తీసుకొచ్చి వొదిలి తన చేతిని నా చేతిమీద కొంచెంసేపు వుంచి తీసేసుకుంది. అంతకన్న మోహానికి యింక నిరాశ ఏముంది ? నా చెంపమీద ఒక్కటి చరిస్తే ఎక్కువ ఆశ వుంటుంది.

వాచరు మా టిఫిన్ కారియరు తీసుకొచ్చాడు.

'వంటలేదంటండి యీ పూటకి !'

గుండెల్లో రాయిపడ్డది.

వూరికి మూడుమైళ్ళు దూరంలో వున్నాము.

'మరియెట్లా ?'

'నువ్వు వొండు' అంది ఆమె. ఆ వాచరుతో

'కూర యేం లేదు.'

'ఏదో వొకటి చెయ్యి-పచ్చడి, చారు' అన్నాను.

'ఏమీ లేవు.'

'మరి మీరెట్లా తింటారు ?'

'చాపలు'

చచ్చాం.

'అవే చెయ్యి' అంది ఆమె.

'ఎందుకు ?'

'తిందాం,'

'చాపలా !'

'ఏం ?'

'నా చాతకాదు.'

'ఎందుకు చాతకాదు, అంతా చాతనవుతుంది వెళ్ళు.'

వాచరు వెళ్ళాడు.

'ఏమిటి ? చాపలు తింటారా మీరు ?'

'ఎప్పుడూ తినలేదు,'

'మరి తినగలరా,'

'ఎందుకు తినలేను !'

'కాని తినవొచ్చా !'

'ఏం తింటే ?'

'ప్రాణిహత్య,'

'ఏమైతే.....'

'పాపం: మన తిండి కోసం-'

విసుకుతో-

'లోకమంతా పెద్ద హత్యామందిరం. చూడు. అన్నికోట్ల ప్రాణులకూచావే అంతం. అందేకాదు, ఒక ప్రాణికి యింకో ప్రాణి ఆహారం.'

'కాని మనం మనుషులమే-'

'ఐతే నేం ? దేవుడూ, చంపుతాడు. మృగమూ చంపుతుంది. మధ్య మనిషి మాత్రమేనా చంపకూడనిది ?'

'కాని వాటికి బాధ !'

'మనం కాకపోతే యింకోపెద్దచాప తింటుంది, రోగంతో బాధపడి చస్తాయి. ఏట్లానూ తప్పదు.'

నోరు మూసుకున్నాను.

చేపల కూరతో భోజనం వొచ్చింది. నేను ముందేవెళ్ళి, దూరంగా పొయ్యిమీద అన్నం వొడ్డించుకున్నాను. ఆమెకి దూరంగా కూచున్నాను భోజనానికి. ఐనా వాసనవొస్తోంది. ఆమె ముందు కొంచెం మొహం చిట్లించింది. ఎముక ఎలా తియ్యాలో అప్పుడప్పుడు వాచర్ని ప్రశ్నించింది. మాట్లాడకండా తినేసింది. నేనేమీ తిననేలేదు.

భోజనం తరవాత కుర్చీ దూరంగా వేసుకు కూచున్నాను.

'దగ్గిరకి రండి. వాసనలేదు.'

అని నా దగ్గిరికి వొచ్చి చేతిని నా ముక్కుమీద అదిమింది, అంబరు వాసన వేసింది. ఆ చేతిని పట్టుకుని చెంప కదుముకున్నాను.

'చూడండి. నానోరూ వాసనలేదు. నుంచోండి వాసన చూడండి.

లేదు.

నిద్రపోయినాము. నాకు ఆమె కలలే వొస్తున్నాయి. కలలోకూడా బంగాళయే-ఆమె లేచి నా పక్కన ఏడుస్తో కూచున్నట్టు, మళ్ళీ మారినన్ను కావిలించుకున్నట్టు ఇద్దరం వొళ్ళు తెలియక మంచంమీద నించి దొర్లినట్టు, కలతో వులికిపడి లేచాను, ఆమె పక్కవేపు చెయ్యి జాచాను. ఏమీ తగలలేదు. ఇంకా జరిగాను. ఏమయింది ?

* * *

కిటికీలోంచి వరండాలోకి చూశాను. కొంచెం చలిచలిగా వుంది పగలు కురిసిన వాన వల్ల. ఆమె లేదు. తలుపు మెల్లిగా తీసి చీకట్లో వెతికాను. సముద్రపు వొడ్డున నీటికి ఒక బెత్తెడు దూరంలో యిసికలో కూచుని వుంది. చీరె తడుస్తోవుండి వుండాలి నేను కదలక నుంచున్నాను.

నా కలలవల్ల కలిగినా భ్రాంతిలో ఆమె మీద కామ పడుతున్నాను. ఆమె కలలో కనపరిచిన దయ యీ వాస్తవ లోకంలోకే ప్రవేశ పెట్టింది. నా మనసు- అంగీకరిస్తుందనే నా నిశ్చయం.

మెల్లిగా సముద్రపు ఘర్షణలోంచి చంద్రుడుదయించాడు. ఈ దృశ్యాన్ని చూసే, యేకవో సముద్రం తరచగా చంద్రుడయించాడని వ్రాశాడు పురాణాలో, చంపలమీదా మెడమీదా ఆడుతున్న నల్లని జుట్టు మెరవడం ప్రారంభించింది. ఇసికనేలమీద పిండి జల్లినట్లుంది. నీళ్ళు భయం మాని కలకలమంటున్నాయి. ఆమె తదేకదృష్టిలో చూస్తోంది సముద్రాన్ని. పెదవులు కొంచెంగా కదులుతున్నాయా అనిపించిందినాకు.

'ఏమిటి ఇక్కడవున్నావు?' అన్నాను బుజంమీద చెయ్యేసి. నా వంక తిరిగి చూడలేదు.

నిద్రపోతున్న కనుగుడ్డువలె నీళ్ళమీద నిలిచింది చందమామ.

'చూడండి. చూడండి.' అంది నావంక తిరగకుండానే, చంద్రుడి పచ్చని కాంతి ఆమె నుదుటిమీద పడుతోంది. ఆమె కంఠం నాతో ఏదో రహస్యం మాట్లాడినట్లయింది. మా యిద్దరికే తెలిసిన సంగతి. యింకెవరికీ తెలీనిది. ఆమె వంక చూస్తో దిగ్భ్రమచెంది నుంచున్నాను. ఆమెరూపమే మారింది, మాంసమూ, ఎముకలూ కరిగిపోయినాయి ఆ గాలిలోకి. మొహంలోకి పెద్దవెలుగు వొచ్చింది. పెదవులు వొణుకుతున్నాయి. చంపలు యెర్రగా ఐనాయి, పల్చని వక్షంలోకి కొత్తప్రాణం వొచ్చింది. దేహమంతా కొత్తజ్యోతి వెలుగుతున్నట్టుంది.

చూడండి ఆ చిన్ని చంద్రుడు-ఆ నీళ్ళమీద ఆరాటం-నా హృదయంలోనే యిట్లావుందే? ఆ హృదయంలోనో! అన్ని హృదయంలోనో! అన్ని సముద్రాలలో, ఆ చంద్రుడి గోళంలో ఆ తెల్లని కాంతి యెంత జీవనాన్ని కల్పించిందో ఎన్ని ప్రాణులు ఆనందనృత్యం చేస్తున్నాయో! ఎన్ని సరసుల్లో, నదుల్లో, మేల్కొన్నవో యీ అర్ధరాత్రి, యీ మాధుర్యం. నిన్నటి వాన, యిందాకటి చీకటి యీ వెన్నెల, రేపటి ఎండ, అన్న మనోభావాలు......ప్రపంచాలు సృష్టించే మనసులోని ఛాయలు-మోహం, బాధ, రోగం, ఆనందం, వేదన యీ చిన్ని ఇసిక అలలనించి. భూకంపాలవరకు-చిన్ని పుష్ప వికాసంనుంచి, నక్షత్రవిప్లవాలవరకు-అన్నీ యివన్నీ ఆ హృదయంలోని అశాంతి మనం యీ యిసికిని చిమ్మినట్టే, యెన్ని గోళాల నాశనమో!

ఆనందవేదన.....గానచ్ఛాయలు, యీ కట్లువొదిలి-ఆ వెన్నెట్లో కలిసి, ఆనీళ్ళమీద చిందులు తొక్కితే, -ఇదంతా నేనే-నేనే-నేను వెళ్ళిపోతాను నేను కలిసిపోతాను'' అని వూగి మెల్లిగా నా బుజంమీదికి వూగింది. నేను ఆమెని వోళ్ళో పడుకోపెట్టుకొని, పమిటను సద్ది చంపల మీద వేళ్ళు మెల్లిగా రాస్తో కూచున్నాను. అంతకన్నా కోర్కెలేదు. ధైర్యమూలేదు, నా వొళ్ళంతా గొప్ప ఆనందముతో నిండిపోయింది. ఎడారివంటి యిసిక, సముద్రపు బిందువులతో మీద చిమ్మేగాలి, ఆ పెద్ద హొరు, ఈమె నా తొడలమీద-ఇదే నా స్వర్గమనుకున్నాను. ఆమెనించి గొప్పశక్తి నాలోకి ప్రవహిస్తున్నట్టుంది. ఇట్లా యింద్రియాలన్నీ ఉన్నతానందాలకి మేలుకోడమే స్వర్గం. స్వర్గం ఒక స్థలం కాదు. ఒక స్థితికాదు. క్రమంగా స్వర్గంలోకి ఎదుగుతాం యవ్వనంలోకి యెదిగినట్టు అనిపించింది. మెల్లిగా యీ మనసూ యింద్రియాలూ కొత్త, తీవ్రతర ఆనందాలకి మేల్కొంటాయి. అంతమేముంది? ఆ రోజు తెలిసింది నాకు, నలభైయేళ్ళూ నేను నిద్రపోయినానని. కాని యీమె! ఈమె మీద ప్రేమలవల్లనా, లేదు ప్రేమలేదు. కాని ఆమెనించి ఏదోశక్తి ప్రవేశించి నా బంధనాలు వొదిల్చి మేల్కొలిపింది సౌందర్యంతో ఐక్యమై కూచున్నాను.

మెల్లిగా కళ్ళు విప్పింది. చిరునవ్వు నవ్వి లేచి కూచుంది. జుట్టుని దగ్గిరగా తీసుకుని ముడి వేసుకోపోయింది. నా మనసులో ఏం మార్పు వొచ్చిందో. ఆమె వొళ్ళో తలపెట్టి పెద్దగా యేడ్చాను. ఆమె మాట్లాడలేదు. క్రమంగా నా ఆరాటం తగ్గింది. నా ఆనందమంతా

పోయింది. పెద్ద శూన్యం! బాధా ఆవరించాయి, వెన్నెల వున్నా అంతా చీకటిలాగే తోచింది. ఆమెని కావిలించుకున్నాను. కొంచెంవుండి లేవపోయింది. వొదలలేదు నేను. ఆమెని మెల్లిగా ఇసుకలోకి వంచి పడుకున్నా. అట్లానే చూస్తోంది. ఐనా నాకు ధైర్యం లేదు.

'మీరు కావాలి నాకు'

అనేశాను. నా ప్రాణాల్ని ఆమె ముందు పారేశాను.

'నేను! నిజమా?'

ఆమె పెదవి విరిచింది.

నిజమా? ఆమె కావాలా ఏమో తెలీదు. కాని యీ బాధేమిటి? ఆమె కోసమే. ఇంక ఏవిధంగా భరించను! అదే గతి!

కాని......ఆమె రొమ్ముకి వొత్తుకోకుండా గుండీల్ని తీసేశాను. ఆమె మెడపక్కన ముద్దు పెట్టుకున్నాను. కాని నాలోకి ఏమీ కొత్త ఆనందం రాలేదు.

ఈమె కావాలా?

'వొద్దు. లేవండి.'

"లేవను నాకు కావాలి."

"నా మాట వినండి. మీకే తెలుస్తుంది వొద్దు, ఎందుకు యీ చిరాకు?"

"కాదు. నా ప్రాణం మీ చేతుల్లో పెట్టాను".

"సరే మీ యిష్టం"

అట్లానే ఆ యిసికలో వుండిపోయినాము. అట్లానే యిసికలో నిద్రపోయినాము.

తెల్లవారి యెండ మమ్మల్ని లేవతీసింది. సిగ్గుపడి తల వొంచుకొని కూచున్నాను. ఎందుకింత పశవునైనానా అనుకున్నాను.

"సంతుష్టి అయిందా?" అంది లేచి నవ్వుతో.

ఈమె మనిషేనా? నాకు కోపం వొచ్చింది. అందులో నా సిగ్గుకి తోడుగర్వమూ లేకపోలేదు. ఈమె యింత వేదాంతి రాత్రి నా చేతులకింద ఆయాసపడ్డదికదా అని! సుఖంలో మూతలుపడే ఆమె కళ్ళని ముద్దు పెట్టుకోగలిగిన ఘనుణ్ణి కదా అని! ఆమెలోంచి చివరికి వాంఛని మేల్కొలిపాను కదా అని.

"మీకు?"

"కోర్కె వుంటేకద సంతుష్టి."

అబద్ధం. తప్పకుండా అబద్ధం. ఆ చేతులవూపు. ఆ పెదవుల్లోని తృష్ణ!

"అబద్ధ మాడుతున్నారు. మీకే తెలుసు."

"ఆ సౌఖ్యం శరీరంది. నాదికాదు. నాకు అవసరంలేదు."

"పోనీ అదీ సౌఖ్యమేగా!"

"చాలా స్వల్పం"

"నేనూ ?"

"మీరు మీరు, ఏమవసరం నాకు ?" తృణీకారంతో పెదవి విరిచి నా కళ్ళలోకి చూసింది. నా మీద ఏమీ ఇష్టంలేకండానేనా - ఆ మాటలు విన్న పురుషుడి హృదయం ఎంత గాయపడుతుందో, అంతకన్న భూమిలోకి కుంగిపోతే నయమనిపించింది.

"మరి యిష్టంలేకండానే-"

"అవును"

"ఎందుకు ?"

"ఏమైతేనేం ?"

"మీ దేహం-యీ వ్యభిచారం-"

"దేహంది"

"ఇంకెవడన్నా అడిగితే-"

"తీసుకోనీండి. ఏం ఉపయోగం అంతకన్న - మరీ అంత బాధపడితే- పోనీండి- ఇస్తేనేం-ఇంతలో !" మీరైతేనేం ఇంకోరైతేనేం.

"-ఎవరూ కాపోతేనేం ?"

"మరి నామీద ఇష్టంలేదా ?"

"దానికీ దీనికీ సంబంధమేమిటి ."

◆ ◆ ◆

*ప్రచురణ : (అనసూయ కథల సంపుటి) ప్రజాప్రచురణలు, 1959*